క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ నాయకుడికి 'అన్నా' నివాళి



లక్ష్మీరెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న అన్నా రాంబాబు

పొదిలి రూరల్: పొదిలి మండలం సూదన గుంట గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు చెన్ను లక్ష్మీరెడ్డి(80) బుధవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నా రాంబాబు పార్టీ నేతలతో కలిసి లక్ష్మీరెడ్డి మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, పార్టీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. ఆయన వెంట పార్టీ రాష్ట్ర కార్యదర్శి కేవీ రమణారెడ్డి, గొలమారి చెన్నారెడ్డి, వై.వెంకటేశ్వరరావు, సర్పంచ్ కోటిరెడ్డి తదితరులు ఉన్నారు.

వేడుకగా పట్టాభిరామ స్వామి ఆలయ ప్రతిష్ఠ



ముస్తాబైన పట్టాభిరామస్వామి ఆలయం

కొనకనమిట్ల: మండలంలోని రేగుమానిపల్లి పంచాయతీ మర్రిపాలెం బీసీ కాలనీలో నూతనంగా నిర్మించిన సీతా లక్ష్మణ హనుమత సమేత పట్టాభిరామస్వామి ఆలయ నూతన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం వరకు రోజూ హోమాలు, సర్వ దేవతా అభిషేకాలు, అర్చనను వేదపండితుడు ఓరుగంటి సీతారామశర్మ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 5 రోజులపాటు ఆలయం వద్ద భక్తులకు, గ్రామస్తులకు అన్న సంతర్పణ చేస్తున్నట్లు తెలిపారు. ప్రతిష్ఠ ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు.

215 మందికి నేత్ర వైద్య పరీక్షలు



వైద్యశిబిరంలో పాల్గొన్న రోగులు

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం జాతీయ అంధత్వ నివారణ సంస్థ, శంకర నేత్రాలయ, వాసవీ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 215 మంది రోగులకు నేత్ర, సుగర్, బీపీ పరీక్షలు నిర్వహించినట్లు వాసవీ క్లబ్ జోన్ చైర్‌పర్సన్ కె.రవికుమార్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ పీవీ లక్ష్మీనారాయణ తెలిపారు. 96 మందికి శుక్లాల ఆపరేషన్ అవసరమని వైద్యులు నిర్ధారించి కాకానిలోని శంకర నేత్రాలయకు బస్‌లో తరలించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు వి.వెంకటేశ్వర్లు, జి.రామారావు, జి.ఆంజనేయప్రసాద్, రామకృష్ణ, పి.హరికృష్ణ, డి.బాబు, ఎస్.చలపతిరావు, గురుస్వామి, సువర్ణ, శంకర కంటి వైద్యశాల సిబ్బంది రాంబాబు, రవికాంత్, టెక్నీషియన్లు పాల్గొన్నారు.

ఆరోగ్య ఉప కేంద్రాలకు

గ్రహణం



నాయుడుపల్లిలో ప్రారంభానికి నోచుకోని ఆరోగ్య ఉప కేంద్రం

- డివిజన్‌లో పూర్తి కాని హెల్త్ వెల్‌నెస్ సెంటర్లు
- మంజూరైనవి 179.. పూర్తయినవి 67 కేంద్రాలు
- వివిధ దశల్లో నిలిచిపోయిన భవన నిర్మాణ పనులు

మార్కాపురం:

పేద ప్రజల ఆరోగ్యానికి పెద్ద పీట వేస్తూ గ్రామ స్థాయిలో వైద్య సేవలు అందించేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్ల(ఆరోగ్య ఉప కేంద్రాలు)ను ప్రస్తుత కూటమి ప్రభుత్వం గాలికొదిలేసింది. ఆరోగ్య ఉప కేంద్రాల నిర్మాణాలకు ఏడాది కాలం నుంచి గ్రహణం పట్టింది. ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడం, పర్యవేక్షణ కొరవడటంతో భవన నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. నిధులు ఉన్నాయని అధికారులు చెబుతున్నప్పటికీ నిర్మాణ పనులు ఎందుకు పూర్తి కావడం లేదో దేవుడికే ఎరుక.

పశ్చిమ ప్రకాశంలోని మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు నియోజకవర్గాల్లో మొత్తం 179 వెల్‌నెస్ సెంటర్లను గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మంజూరు చేసింది. గత ఏడాది సార్వత్రిక ఎన్నికల నాటికే సుమారు 50కి పైగా ఆరోగ్య ఉప కేంద్రాలను ప్రారంభించారు. ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో భవన నిర్మాణ పనులను పూర్తిగా నిలిపేసిన అధికారులు.. నూతన ప్రభుత్వం ఏర్పాటై ఏడాది గడుస్తున్నా వాటి పురోగతిపై దృష్టి సారించలేదు. ఒక్కో భవనానికి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.20.50 లక్షలు కేటాయించగా పనులు వివిధ దశలో ఉన్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక కొన్ని ఆరోగ్య ఉప కేంద్రాల నిర్మాణం అర్ధంతరంగా నిలిచిపోగా, మరికొన్ని మాత్రం నత్తనడకన సాగుతున్నాయి.

పశ్చిమ ప్రకాశంలోని మూడు నియోజకవర్గాల్లో ఇప్పటి వరకు 67 భవనాల నిర్మాణం పూర్తయినట్లు అధికారుల గణాంకాలు వెల్లడిస్తున్నాయి. 22 వెల్‌నెస్ సెంటర్లు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నట్లు తెలుస్తోంది. మిగిలిన ఆరోగ్య కేంద్రాలను ఎప్పుడు ప్రారంభిస్తారో.. అవి ఎప్పటికి పూర్తవుతాయో ఎవరికీ అంతుచిక్కడం లేదు. అధికారులు కూడా భవన నిర్మాణాల కాంట్రాక్టర్ల పట్ల మెతక వైఖరి అవలంబిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. మార్కాపురం మండలంలోని ఇడుపూరులో వెల్‌నెస్ సెంటర్ నిర్మాణం ఆగిపోగా, నాయుడుపల్లిలో భవన నిర్మాణం పూర్తయినా ఎలక్ట్రిక్ వైరింగ్, మంచి నీటి సదుపాయం లేదని ప్రారంభించలేదు. ఇలాంటి సమస్యలతో ప్రారంభానికి నోచుకోని సెంటర్లు చాలానే ఉన్నాయి. ఇదిలా ఉండగా ఆరోగ్య కేంద్రాలకు కేటాయించిన వైద్య ఆరోగ్య సిబ్బంది ప్రస్తుతం సచివాలయాల్లో విధులు నిర్వర్తించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

వెల్‌నెస్ సెంటర్ల ఉపయోగాలు

- గ్రామీణ ప్రజలకు సొంత ఊరిలోనే అందుబాటులోకి వైద్య సేవలు
- జ్వరం, దగ్గు, జలుబు, బీపీ, షుగర్, తలనొప్పి, శ్వాస కోశ వ్యాధులకు సమయానుకూలంగా చికిత్స
- వ్యాధులు ముదిరేలోగా ముందుగానే గుర్తించి సరైన చికిత్స
- గర్భిణులు, బాలింతలకు టీకాలు, ఆరోగ్య సలహాలు ఇవ్వడం
- పిల్లలకు అవసరమైన వ్యాధి నిరోధక టీకాలు వేయడం
- ఆరోగ్య విద్యపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం
- టెలీ మెడిసిన్ సదుపాయం
- అత్యవసర సేవలను ప్రాథమికంగా అందించడం
- ఇంతటి ప్రాధాన్యత ఉన్న వెల్‌నెస్ సెంటర్ల ఏర్పాటుపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పనులు చేయిస్తున్నాం

మార్కాపురం డివిజన్‌లో వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణం పనులు జరుగుతున్నాయి. బిల్లులు కూడా పెండింగ్ లేకుండా చెల్లిస్తున్నాం. వీటి నిర్మాణాలపై దృష్టి పెడతాం. కొన్ని సెంటర్లు పూర్తయ్యాయి. వాటిని ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం.

– జి.శ్రీనివాసులు, పంచాయతీరాజ్ ఈఈ, మార్కాపురం

కంభంలో పోషణ పక్వాడా ర్యాలీ



కంభంలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

కంభం: పట్టణంలోని 72, 73వ నంబర్ అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో బుధవారం పోషణ్ పక్వాడా పౌష్టికాహార పక్షోత్సవ కార్యక్రమంలో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. పౌష్టికాహార పద్ధతులు, తల్లిపాల ప్రాముఖ్యత, ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో అవసరమైన ఆహారం, వైద్య సేవలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ గాలెమ్మ, కార్యకర్తలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, బాలింతలు పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు అమృతం



చిన్నారులతో మాట్లాడుతున్న సీడీపీఓ

కొనకనమిట్ల: శిశువుల్లో వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించే గుణం తల్లిపాలలో ఉంటుందని, బిడ్డకు ఆరు నెలల వరకు తల్లిపాలు క్రమం తప్పకుండా ఇవ్వాలని సీడీపీఓ సుధామారుతి పేర్కొన్నారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా బుధవారం మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమాల్లో ఆమె మాట్లాడారు. అప్పుడే పుట్టిన బిడ్డకు ముర్రుపాలు పట్టించాలని, బిడ్డలకు పాలు ఇవ్వడంలో ఎటువంటి అపోహలు పెట్టుకోవద్దని స్పష్టం చేశారు. సమావేశాల్లో సూపర్‌వైజర్లు సుభాషిణి, ప్రసన్న, కార్యకర్తలు పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో రైతులకు మేలు

- దర్శి కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ రమేష్‌బాబు



మాట్లాడుతున్న డాక్టర్ రమేష్

కొనకనమిట్ల: భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా పంటలు సాగు చేస్తే రైతులకు పెట్టుబడి భారం తప్పుతుందని దర్శి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రమేష్‌బాబు పేర్కొన్నారు. మండలంలోని వాగుమడుగు రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ సిబ్బంది, రైతులకు నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. భూసార పరీక్షలు చేయించుకోవడం ద్వారా పోషక లోపాలు తెలుస్తాయని, తద్వారా ఏఏ ఎరువులు వేసుకోవాలి, ఏ పంటలకు నేల అనుకూలం అనేది తెలుస్తుందన్నారు. పత్తి పంట సాగు చేసే రైతులు జాగ్రత్తగా ఉండాలని, తెగుళ్లను గమనించాలని, ముఖ్యంగా గులాబీ పురుగు వ్యాప్తిపై అప్రమత్తంగా ఉండాలన్నారు. పంటల బీమాను ఈనెల 14 వరకు పొడిగించినట్లు ఏఓ తెలిపారు. కార్యక్రమంలో బీబీఎం నాగభూషణం, వీఏఓలు పాల్గొన్నారు.



ఉన్నగురువాయిపాలెం వంతెనకు ఇరువైపులా పెరిగిన చిల్లచెట్లు



ఏలూరు ముసి నదిపై గుంతలతో అధ్వానంగా మారిన బ్రిడ్జి

బ్రిడ్జిలపై గుంతలు.. వాహనదారులకు ఇక్కట్లు

పొదిలి రూరల్: పొదిలి మండల పరిధిలోని ఏలూరు వద్ద ఒంగోలు–కర్నూలు రహదారిలో ముసి నది బ్రిడ్జి, దర్శి–పొదిలి రహదారిలో ఉన్నగురువాయిపాలెం వద్ద ముసిపై బ్రిడ్జి శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారాయి. ఏలూరు వద్ద బ్రిడ్జిపై గోతులకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టినా రోజులు గడవక ముందే మళ్లీ పరిస్థితి మొదటికొచ్చింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఉన్నగురువాయిపాలెం వద్ద బ్రిడ్జిపై ఏర్పడిన గుంతలు చూసి ద్విచక్ర వాహనదారులు అటుగా వెళ్లాలంటేనే భయపడుతున్నారు. ఇటీవల కాలంలో తరచూ ఇక్కడ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. బ్రిడ్జిల అంచుల వెంట రిటెయినింగ్ వాల్స్‌పై పిచ్చి మొక్కలు పెరగడంతో వాహనాదారులు అయోమయానికి గురవుతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రెండు బ్రిడ్జిలకు మరమ్మతులు చేయించాలని వాహనదారులు కోరుతున్నారు.



ఉన్నగురువాయిపాలెం వద్ద బ్రిడ్జిపై భారీ గుంత

వైఎస్సార్ సీపీ రాష్ట్ర మైనారిటీ విభాగ అధికార ప్రతినిధిగా గౌస్ మొహిద్దీన్



గౌస్ మొహిద్దీన్

మార్కాపురం: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మార్కాపురం పట్టణానికి చెందిన సయ్యద్ గౌస్ మొహిద్దీన్‌ను ఆ పార్టీ రాష్ట్ర మైనారిటీ విభాగ అధికార ప్రతినిధిగా నియమిస్తున్నట్లు కేంద్ర కార్యాలయం బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ సందర్భంగా గౌస్ మొహిద్దీన్ మాట్లాడుతూ.. మార్కాపురం నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ అభివృద్ధికి కృషి చేస్తానని, తనకు పదవి వచ్చేందుకు సహకరించిన ముఖ్య నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

అధ్వానంగా స్టేషన్‌పల్లి దారి



రోడ్డుపై రోజులతరబడి నిల్వ ఉన్న మురుగు

కొనకనమిట్ల: మండల కేంద్రం కొనకనమిట్ల బస్టాండ్ సెంటర్–స్టేషన్‌పల్లి పోలేరమ్మ ఆలయ ప్రధాన రహదారి మురుగుకూపంగా మారింది. రహదారికి ఇరువైపులా సైడు కాలువలు లేకపోవడంతో వర్షం నీరు ఎక్కడికక్కడే నిల్వ ఉంటోంది. దీంతో రోడ్డుపై నడవడానికి కూడా స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ఇళ్ల నుంచి వచ్చే వృథా నీరు కూడా రోడ్డుపై నిల్వ చేరుతుండటంతో దోమలు విజృంభిస్తున్నాయి. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి రహదారిని బాగుచేయడంతోపాటు డ్రెయినేజీ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పురుగుమందుల దుకాణాలు తనిఖీ

అర్ధవీడు: అనుమతి లేకుండా పురుగుమందులు విక్రయిస్తే దుకాణదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని తనిఖీ అధికారి ఎస్‌కే అబ్దుల్ రఫీక్ హెచ్చరించారు. అర్ధవీడు, పాపినేనిపల్లె గ్రామాల్లో దుకాణాలను ఆయన బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనుమతి పత్రాలు లేని రూ.2,50,767 విలువైన ఎరువులు, పురుగుమందుల విక్రయాన్ని నిలిపేసినట్లు తెలిపారు. రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని చెప్పారు. జీ1, జీ2, జీ3 పర్మిషన్ ఉన్న బయో మందులను మాత్రమే విక్రయించాలని స్పష్టం చేశారు. తనిఖీల్లో ఇన్‌చార్జి ఏఓ శివ గంగ ప్రసాద్, వీఏఏలు పాల్గొన్నారు.

ఆ సచివాలయానికి సెలవట!

- వీసీపల్లి సచివాలయంలో ఖాళీ కుర్చీలు దర్శనం

దర్శి: మండలంలోని వెంకటాచలంపల్లి పంచాయతీలోని సచివాలయంలో బుధవారం ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. సచివాలయంలో కనీసం ఒక్కరంటే ఒక్క ఉద్యోగి కూడా లేకపోవడం గమనార్హం. పలు అవసరాలపై వచ్చిన ప్రజలు గంటల తరబడి చూసి ఎవరూ రాక పోవడంతో వెనుదిరిగి వెళ్లారు. ప్రభుత్వ కార్యాలయంలో ఒక్కరంటే ఒక్కరు కూడా విధులకు హాజరు కాక పోవడంపై ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. ఈ సచివాలయంలో రాజకీయ జోక్యం మితిమీరింది. టీడీపీ నేతలు ఏం చెప్తే అధికారులు అదే పాటిస్తూ నిబంధనలు సైతం ఉల్లంఘిస్తున్నారు. వారు చెప్తే పనులు చేసే వారుంటే చాలు సచివాలయానికి వచ్చినా రాకపోయినా వారు విధుల్లోనే ఉంటారు. అలా కాదని ఎవరైనా వారికి తెలియకుండా పనులు చేశారో వారు బదిలీపై వెళ్లాల్సిందే. సచివాలయం పరిధిలో వెంకటాచలంపల్లి, చలివేంద్ర, అబ్బాయిపాలెం, నడింపల్లి గ్రామాలు ఉన్నాయి. గ్రామాల్లో ఒక పింఛన్ మంజూరు చేయాలన్నా, రేషన్ కార్డు మంజూరు చేయాలన్నా టీడీపీ నేతల సిఫార్సులు ఉండాల్సిందే.

స్మార్ట్ మీటర్లు ఉపసంహరించుకోవాలి



ఏడీఈ శేషగిరిరావుకు వినతి పత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

గిద్దలూరు రూరల్: ప్రజలపై అధిక భారాన్ని మోపే స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోవాలని సీఐటీయూ నాయకుడు టి.ఆవులయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఐటీయూ నాయకులు బుధవారం స్థానిక విద్యుత్ శాఖ ఏడీఈ శేషగిరిరావును కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆవులయ్య మాట్లాడుతూ.. సామాన్యులకు షాక్ ఇచ్చి అదానీకి మేలు చేసే స్మార్ట్ మీటర్ల ఏర్పాట్లను నిలిపివేయాలన్నారు. స్మార్ట్ మీటర్లను పగలగొట్టాలని యువగళం పాదయాత్రలో చెప్పిన నారా లోకేష్.. ప్రస్తుతం ఆ ఊసే ఎత్తడం లేదని మండిపడ్డారు. ట్రూ అప్ చార్జీలు, అదనపు చార్జీలు, స్మార్ట్ మీటర్లను రద్దు చేస్తామని నారా చంద్రబాబునాయుడు ఎన్నికల వేళ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని ప్రతి సభలో చెప్పి, నేడు మాట తప్పారని విమర్శించారు. ప్రమాదకర విద్యుత్ సంస్కరణ చట్ట సవరణలను నిలిపివేయాలన్నారు. కార్యక్రమంలో ఆటో వర్కర్ల యూనియన్ నాయకులు జి.రాజు, నరేంద్ర, రమణారెడ్డి, ఎస్‌కే బాషా, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

మహిళా రక్షణ చట్టాల అమలులో

ప్రభుత్వాలు విఫలం

- మద్యం నియంత్రణపై దృష్టి సారించాలి
- ఐద్వా జిల్లా కార్యదర్శి రమాదేవి



మాట్లాడుతున్న రమాదేవి

మార్కాపురం: మహిళా రక్షణ చట్టాలను అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని ఐద్వా జిల్లా కార్యదర్శి కె.రమాదేవి విమర్శించారు. బుధవారం ఐద్వా మార్కాపురం పట్టణ మహాసభ స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళా చట్టాల అమలు కోసం ఉద్యమ పంథాలో ముందుకు వెళ్లాల్సి ఉందన్నారు. మహిళలపై లైంగిక దాడులు, గృహ హింస పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తాగడానికి మంచినీరు లేని గ్రామాల్లో మద్యం విచ్చలవిడిగా దొరుకుతోందన్నారు. బెల్టు షాపుల్లో మద్యం విక్రయాలను కట్టడి చేయాలని డిమాండ్ చేశారు. యూటీఎఫ్ నేత ఝాన్సీ పాల్ మాట్లాడుతూ.. పని ప్రదేశాల్లో మహిళలకు రక్షణ కల్పించాలని, స్కీమ్ వర్కర్స్ అందరికీ ప్రభుత్వ పథకాలు అమలు చేయాలన్నారు. పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నిరోధక కమిటీలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మహిళా సమస్యల పరిష్కారం కోసం ఐద్వా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఐద్వా పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఎస్‌కే రెహానా, డి.శారా, శివలక్ష్మి, ప్రమీల, సీఐటీయు జిల్లా కార్యదర్శి రఫీ, పట్టణ కార్యదర్శి రూబెన్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ జాబితాపై దృష్టి సారించండి



మాట్లాడుతున్న తహసీల్దార్ చిరంజీవి, పక్కన ఏఓ, డీటీ

మార్కాపురం: అన్నదాత సుఖీభవ పథకం కింద పెట్టుబడి సాయం అందని రైతుల జాబితాపై దృష్టి సారించాలని తహసీల్దార్ చిరంజీవి సూచించారు. బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వీఆర్‌ఓలు, వీఏఏలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చనిపోయిన రైతుల పెండింగ్ డేటా, మిస్ మ్యాచ్ ఆధార్, లిటిగేషన్ ల్యాండ్ రైతుల జాబితాపై గ్రామ సభలు నిర్వహించి రైతుల సహకారంతో పరిష్కరించాలని సూచించారు. రైతులు తమ పరిధిలోని సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్ల వద్ద దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించాలని చెప్పారు. మండల వ్యవసాయాధికారి కె.బుజ్జిబాయి, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

జేవీవీ నూతన మండల కమిటీ ఎన్నిక



నూతనంగా ఎన్నికైన జేవీవీ మండల కమిటీ సభ్యులు

బేస్తవారిపేట: స్థానిక టీచర్స్ కాలనీలో యూటీఎఫ్ కార్యాలయంలో బుధవారం జన విజ్ఞాన వేదిక మండల నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. జేవీవీ మండల శాఖ గౌరవ అధ్యక్షుడిగా ఎస్‌వీబీఎస్ కృష్ణారెడ్డి, అధ్యక్షుడిగా రంగరాజు, మండల ప్రధాన కార్యదర్శిగా కె.లక్ష్మీకాంతరెడ్డి, కార్యదర్శిగా డి.హరీష్‌రాజు, ఉపాధ్యక్షుడిగా బి.వెంకట రామయ్య, చెకుముకి కన్వీనర్‌గా జి.శ్రీనివాసరావు, హెల్త్ కన్వీనర్‌గా జె.పుల్లారెడ్డి, సభ్యులుగా పి.శ్రీనివాసరెడ్డి, కోశాధికారిగా బి.బాలాజీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ నెల 9వ తేదీన జన విజ్ఞాన వేదిక జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని నూతన కమిటీ నాయకులు కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా, మండల నాయకులు ఐవీ రామిరెడ్డి, డి.ఖాశింవలి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.